క్లుప్తంగా

నేడు పంచాయతీల పురోగతిపై శిక్షణ

తాళ్లూరు (దర్శి): పంచాయతీల పురోగతి 2.0 సూచికపై మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఉంటుందని ఎంపీడీవో దారా హనుమంతురావు తెలిపారు. శిక్షణలో అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొని తమ శాఖల పరిధిలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో సాధించిన పురోగతిపై తగిన నివేదికలు సమర్పించాలన్నారు. ఈ విధానంపై ప్రత్యేక శిక్షణ కూడా ఉంటుందని తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పూర్తి సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

నేడు వైఎస్సార్ జయంతి

మార్కాపురం టౌన్: డివిజన్ కేంద్రం మార్కాపురం పట్టణంలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మార్కాపురం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు తెలిపారు. పట్టణంలోని పాత బస్టాండ్ గడియార స్తంభం వద్ద ఉన్న డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేయనున్నారు. తూర్పువీధిలోని జువ్విచెట్టు వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద అన్నదానం చేయనున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్, జగనన్న అభిమానులు హాజరు కావాలని అన్నా రాంబాబు కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గిద్దలూరు రూరల్: మండలంలోని అంబవరం 33 కేవీ విద్యుత్ లైన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ బి.శేషగిరిరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ముండ్లపాడు, కె.ఎస్.పల్లె, బురుజుపల్లె, కంచిపల్లె విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిల్లో విద్యుత్ తీగల పై ఉన్న చెట్టు కొమ్మల నరికివేతల కారణంగా ఆయా సబ్ స్టేషన్ పరిధిలోని తాళ్లపల్లె, దిగువమెట్ట, కె.బయనపల్లె, నల్లగట్ల, బ్రాహ్మణపల్లె, చంద్రారెడ్డిపల్లె, కొంగలవీడు, ఎస్.బయనపల్లె గ్రామాలతో పాటుగా పట్టణంలోని పి.ఆర్.కాలనీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని కొంగలవీడురోడ్డు, శ్రీరామ్ నగర్, ఏబీఎం పాలెం, విశ్వభారతి స్కూల్ రోడ్డు, అర్బన్ కాలనీల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ తెలిపారు. ప్రజలు గమనించి సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

కొమరోలులో కూడా..

కొమరోలు: మండలంలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని తాటిచెర్లమోటు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నూతన విద్యుత్ లైన్లను ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో మంగళవారం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నామన్నారు. తాటిచెర్ల, నాగిరెడ్డిపల్లె, హసనాపురం, ముత్రాసుపల్లె, దద్దవాడ, గుంద్రెడ్డిపల్లె, నారాయణపల్లె, అలసందలపల్లె, గోవిందపల్లె, పొట్టిపల్లె, అక్కపల్లె, వెంకటాంపల్లె, కంకరవానిపల్లె గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

10న గురుపౌర్ణమి వేడుకలు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కాశిరెడ్డినాయన కుంట ఆవరణలోని శ్రీరామకృష్ణ ధ్యానమందిరంలో ఈ నెల 10వ తేదీ గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు పి.హనుమంతారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సుప్రభాతసేవ, ధ్యానం, గాయత్రి యజ్ఞం వంటి భక్తి కార్యక్రమాలతో పాటుగా గురువు ప్రాముఖ్యత పై పలువురి ప్రసంగాలు ఉంటాయి. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాల్సిందిగా ఆయన కోరారు.

గురుపౌర్ణమి సందర్భంగా పూజలు

బేస్తవారిపేట: స్థానిక త్రిలోక పుణ్యక్షేత్రంలో ఈనెల 10వ తేదీ గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని ఆలయ కమిటీ చైర్మన్ కర్నాటి గిరీష్‌రెడ్డి తెలిపారు. పంచామృత అభిషేకాలు, అలంకరణ, పల్లకిసేవ, సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారన్నారు. యర్రబాలెంకు చెందిన కోలాట బృందంతో కోలాట ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మెడికల్ కాలేజీని త్వరగా ప్రారంభించాలి

మార్కాపురం టౌన్: మార్కాపురం మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్వహించాలని వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీ సెల్ నాయకులు షేక్ కరీంబాషా సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మెడికల్ కాలేజీని ప్రైవేటీకరణ చేయాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్ జగన్ మళ్లీ అధికారంలోకి వచ్చి ఉంటే గతేడాది 5, ఈ ఏడాది 7 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ప్రారంభమై వైద్య విద్య అందుబాటులోకి వచ్చి ఉండేదన్నారు. సుమారు 5 వేల మెడికల్ సీట్లు అందుబాటులో ఉండేవన్నారు. విదేశీ వైద్య విద్యార్థులకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.

సబ్సిడీపై పశువుల దాణా సరఫరా

పొదిలి రూరల్: ప్రభుత్వం పశుపోషకులకు అందజేస్తున్న పశువుల దాణాను 50 శాతం సబ్సిడీపై సరఫరా చేయనున్నట్లు ఉన్న గురవాయుపాలెం పశు వైద్యాధికారి డాక్టర్ బ్రహ్మయ్య తెలిపారు. ప్రస్తుతం 88 బస్తాల పశుదాణా అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. గతంలో 130 బస్తాలు రూరల్ పరిధిలో గ్రామాల పశుపోషకులు సరఫరా చేయగా ఈ సారి పొదిలి నగర పంచాయతీ పరిధిలోని రాజుపాలెం, కొత్తపాలెం, బుచ్చనపాలెం, కాటూరివారిపాలెం గ్రామాల పశుపోషకులకు ఇవ్వనున్నట్లు తెలిపారు.

ప్రమాదకరంగా కల్వర్టు



చట్లమిట్ల ప్రభుత్వ వైద్యశాల వద్ద కల్వర్టుపై గుంత



కల్వర్టు స్లాబ్ కూలడంతో ఇరుక్కున్న ట్రాక్టర్

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్ల ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం వద్ద శిథిలావస్థలో ఉన్న కల్వర్టు బ్రిడ్జి కూలడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఈ కల్వర్టుపై ప్రగళ్లపాడు, బద్వీడు, పోతంపల్లి, రేగుమానిపల్లి, రాజంపల్లి గ్రామాలకు ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తుంటాయి. ద్విచక్ర వాహనదారులకు ప్రమాదకరంగా ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. పది రోజుల క్రితం కల్వర్టు మీదుగా ఎరువుల లోడు ట్రాక్టర్ వెళ్లడంతో ఒక్కసారిగా స్లాబ్ కూలి వాహనం ఇరుక్కుపోయింది. దాన్ని బయటకు తీసేందుకు రైతు నానా అవస్థలు పడ్డారు. ఇలాంటి సంఘటనలు జరగకముందే అధికారులు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఆదమరచి ఎవరైనా ప్రయాణించినా, నడిచినా గుంతలో పడి గాయాలపాలవుతున్నారు. రాత్రి పూట గుంత కనపడక పోవడంతో అందులో పడి గాయాలైన సంఘటనలు ఎన్నో ఉన్నాయని వాహనదారులు భయందోళన చెందుతున్నారు. కల్వర్టుపై గుంతలు పడి రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నామని అధికారులకు చెప్పినా పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి గుంత వద్ద ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందు జాగ్రత్తగా రేడియం స్టిక్కరింగ్‌తో హెచ్చరిక బోర్డు అధికారులు ఏర్పాటు చేయక పోవడంపై వాహనదారులు మండిపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే నూతన బ్రిడ్జిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతన్నారు.

వైఎస్సార్ జయంతిని జయప్రదం చేయాలి

కురిచేడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా పార్టీ అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని మంగళవారం జయప్రదం చేయాలని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ కోలా సంతోష్ కుమార్‌లు ఒక ప్రకటనలో కోరారు. పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో కురిచేడు బస్టాండ్ సెంటర్లో ఉదయం 9.30 గంటలకు కేక్ కటింగ్, పడమర వీరాయిపాలెం శ్రీ కరుణా వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. మండలంలో రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయి, మండల స్థాయి పార్టీ పదవులు, అనుబంధ విభాగాల్లో ఎన్నికైన నాయకులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పుల్లలచెరువు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించాలని యర్రగొండపాలెం శాసనసభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గం పరిధిలోని అన్ని గ్రామాల్లో జయంతిని ఘనంగా నిర్వహించాలని, విగ్రహాలకు పాలాభిషేకం, విద్యార్థులకు పుస్తకాలు పంచడం, రోగులకు రొట్టెలు పంపిణీ, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అన్ని గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు హాజరు కావాలని శాసనసభ్యుడు చంద్రశేఖర్ కోరారు.

దర్శి: దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ముత్తినీడి సాంబయ్య సోమవారం ఒక ప్రకటనలో కోరారు. కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలు హాజరవుతారన్నారు. ఉదయం 11 గంటలకు దర్శి గడియార స్తంభం వద్ద, వైఎస్సార్ సెంటర్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించి కేక్ కట్ చేస్తారన్నారు.

పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పదవుల్లో ఉన్న ప్రముఖులందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం



ఐనముక్కలలో..



గ్రామోత్సవం నిర్వహిస్తున్న పీర్లు

దొనకొండ: కులమతాలకు అతీతంగా మత సామరస్యానికి ప్రతీకంగా మొహర్రం సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పీర్లను పూలమాలలు, వెండి గొడుగులతో సుందరంగా అలంకరించి వాటిని పట్టుకుని గుండంలో నిప్పులపై నడిచారు. పీర్ల గుండంలో కొబ్బరి చిప్పలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. మండలంలోని చందవరం, ఇండ్లచెరువు, మల్లంపేట, కొచ్చెర్లకోట, నరసింహానాయునిపాలెం గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో పీర్లను మంగళ వాయిద్యాలు, భజంత్రీలతో పురవీధుల్లో ఊరేగించారు. యువకులు గులాం చల్లుకుంటూ నృత్యాలు చేశారు. మొక్కుబడి ఉన్న వారు దానధర్మాలు చేశారు.



ఇండ్లచెరువు గ్రామోత్సవంలో పీర్లు

కురిచేడు: కులమతాలకు అతీతంగా నిర్వహించుకునే మొహర్రం పండగను అత్యంత భక్తిశ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. ఆదివారం రాత్రి పెద్ద షెరగత్ సందర్భంగా అగ్నిగుండ ప్రవేశం చేశారు. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు అన్నదానం, పాట కచేరిలు ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం గ్రామంలోని నాలుగు చావిడీల పీర్లు గ్రామం సెంటర్లో సలాం అందుకోవటం ఆసక్తిగా సాగింది. ఆ కార్యక్రమంలో భక్తులు పాల్గొని పీర్ల సలాం అందుకునే కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం పీర్లు చావిడీలకు బయల్దేరి వెళ్లాయి. సోమవారం తిరిగి నాలుగు చావిడీల పీర్లు గ్రామంలోని శ్రీ కోదండరామాలయం వద్ద మూడురోడ్ల కూడలిలో సలాం అందుకుని అక్కడి నుంచి రైల్వేస్టేషను వద్ద పెద్ద చెరువుకు వెళ్లి నీటిలో కలపటంతో ఈ తతంగం ముగిసింది.

పెద్దదోర్నాల: మండల పరిధిలోని పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మండల పరిధిలోని తిమ్మాపురం, ఐనముక్కల, చిన్న గుడిపాడు గ్రామాల్లో పీర్లను ఊరేగించి అవనతం చేశారు. సందర్భంగా భక్తులు భారీగా పాల్గొని పీర్లకు తమ మొక్కులు చెల్లించుకున్నారు.

పశుగ్రాసం సాగుపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నాగుల్‌మీరా

పుల్లలచెరువు: పశుగ్రాసం సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు పశువైద్యాధికారి నాగుల్ మీరా తెలిపారు. సోమవారం ఆయన పుల్లలచెరువులోని పశుగ్రాసం సాగు చేసుకుంటున్న రైతుల వద్దకు వెళ్లి వారు సాగు చేస్తున్న గడ్డిపేరు, వాటిని ఎలా ఉపయోగించాలో తెలియజేశారు. ఈ నెల 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు గ్రామాల్లో పశుగ్రాసం వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో పశువులకు ఎలాంటి గడ్డిని పెంచుకోవాలి, ఏ సమయంలో అది కోతకు వస్తుంది, దాన్ని ఎలా ఉపయోగించాలి, పశువులకు ఏ సమయంలో ఎలాంటి గడ్డిని వాడాలి అనే దానిపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. సిబ్బంది హిమబిందు, నాగరాజుతో పాటు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కురిచేడు: ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా బాబూ జగజ్జీవన్‌రామ్ మూడు రోడ్ల కూడలిలో ఎమ్మార్పీఎస్ మండల నాయకులు కంభంపాటి జోసెఫ్ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత మంద కృష్ణ మాదిగకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పతాకావిష్కరణ చేసి పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఎఫ్ నాయకులు కంచర్ల జ్ఞాన సుందర్ రాజ్ మాదిగ, ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు బొంత ఏసుదాస్ మాదిగ, ఎంఈఎఫ్ మండల అధ్యక్షుడు కేసనపల్లి కోటేశ్వరరావు మాదిగ, కురిచేడు టౌన్ అధ్యక్షుడు కంభంపాటి ప్రశాంత్ మాదిగ, బరిగల రుతుబాబు మాదిగ, వీహెచ్పీఎస్ మండల అధ్యక్షుడు కంభంపాటి అనిల్ మాదిగ, ఎంఈఎఫ్ జిల్లా నాయకులు శేషు మాదిగ, అనపర్తి సైమన్ మాదిగ, మండల ఎంఈఎఫ్ నాయకులు బడిపాటి మరియదాస్ మాదిగ, పాలెపోగు గురవయ్య మాదిగ, కోలా రత్నం మాదిగ, డి. రాజారావు మాదిగ, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ నాయకులు జి.యోగేశ్వరావు మాదిగ, కంభంపాటి బుల్లయ్య మాదిగ, కమ్మిలి జైపాల్ మాదిగ, (మాజీ)మాదిగ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు కోట మధు, మాదిగ దప్పు కళాకారులు నాయకులు మాదుగుల బాబుమాదిగ, కమ్మిలీ లూకయ్య మాదిగ, వినుకొండ ప్రభాకర్ మాదిగ, మాదుగుల బాబు మాదిగ, బరిగల లక్కీ మాదిగ, విద్యార్థి సంఘం కంభంపాటి సాయన్న మాదిగ, కోలో డాన్ మాదిగ పాల్గొన్నారు.



పులిహోర పంపిణీ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ

పుల్లలచెరువు: ఎమ్మార్పీఎస్ ఏర్పడి 31 ఏళ్ల పూర్తి అయిన సందర్భంగా, మంద కృష్ణమాదిగ పుట్టిన రోజును పురస్కరించుకుని మండలంలోని ప్రతి గ్రామంలో జెండాను ఆవిష్కరిస్తున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుల్ తెలిపారు. సోమవారం మండల కేంద్రం, ఉమ్మడివరంలో మండల అధ్యక్షుడు ఇస్సాక్ ఆధ్వర్యంలో జెండాలు ఆవిష్కరించి మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ద్వారా మనలో వెలుగులు ప్రసరించాయన్నారు. ప్రతి ఒక్కరూ ఎమ్మార్పీఎస్‌కు మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. నాయకులు సింగా ప్రసాద్, కందుల వెంకటయ్య పాల్గొన్నారు.

రాజకీయ వేధింపులు ఆపాలి

దొనకొండ: లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని, వీఓఏల కాల పరిమితి సర్క్యులేషన్ రద్దు, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పని భద్రత కల్పించాలని, అక్రమ తొలగింపులు, రాజకీయ వేధింపులు ఆపాలని, గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా ఈ నెల 9న జరుగుతున్న సమ్మెలో వీఓఏలు పాల్గొనాలని సీఐటీయూ నాయకుడు చిరుపల్లి అంజయ్య పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో ఏపీఎం గుడిమెట్ల వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో 28 వేల మంది వీఓఏలు పొదుపు సంఘాల మహిళలకు దీర్ఘకాలికంగా సేవలు అందిస్తున్నారన్నారు. తెలుగుదేశం నేతలు కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారని, సర్క్యులర్ రద్దు చేసి వీఓఏల ఉపాధిని కాపాడాలని, వేతనాలు పెంచాలని అంజయ్య కోరారు.



ఏపీఎంకు సమ్మె నోటీసు ఇస్తున్న వీఓఏలు

చిల్లచెట్లు తొలగించిన అధికారులు



విద్యుత్ తీగల చుట్టూ తొలగించిన చిల్లకంప



'సాక్షి'లో ప్రచురించిన కథనం

సాక్షి ఎఫెక్ట్..

తాళ్లూరు (దర్శి): మండలంలోని బొద్దికూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఎదురు రోడ్డు మార్గంలో విద్యుత్ స్తంభం శిథిలావస్థలో ఉంది. ముల్లకంపపై విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి ఈ నెల 5వ తేదీన ప్రమాదంగా విద్యుత్ తీగలు అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురించిన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. సోమవారం పాఠశాల ఎదురుగా ఉన్న చిల్లకంపను తొలగించి విద్యుత్ తీగలను సరి చేసి ఇబ్బందులు తొలగిపోయేలా చేశారు. త్వరలో కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు చేస్తామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

డెంగీ, మలేరియాపై అవగాహన ర్యాలీ

పెద్దారవీడు: జాతీయ డెంగీ మాసోత్సవాన్ని పురస్కరించుకుని కర్రోల ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం గుర్రపుసాల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం డెంగీ, మలేరియాపై ర్యాలీ నిర్వహించారు. హెల్త్ అసిస్టెంట్ భరత్‌భూషణ్ మాట్లాడుతూ ఇంట్లో ఉన్న నీటి తొట్టెలపై ట్యాంకులపై, పంపులపై తప్పనిసరిగా మూతలు అమర్చాలని, ఇంట్లో, ఇంటి పరిసరాల్లో ఉన్న వృథా వస్తువులను తీసివేసి శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలని సూచించారు. ఇంట్లోగానీ, ఇంటి చుట్టుపక్కల గానీ వారం రోజులు పైబడిన నిల్వ ఉన్న నీటిని గుర్తించి వెంటనే తొలగించుకోవాలని ప్రజలకు చెప్పారు. హెచ్‌ఎం మాట్లాడుతూ డెంగీ, మలేరియా, సీజనల్ వ్యాధుల నుంచి చాలా జాగ్రత్తలు పాటించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు వచ్చే అవకాశం ఉండదన్నారు. ఉపాధ్యాయులు సాయి, బాలగోపయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీలో హెచ్‌ఎం చంద్రశేఖర్, విద్యార్థులు

ముందస్తు ప్రణాళికలతో లక్ష్యం చేరుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దినేష్

దర్శి: ముందస్తు ప్రణాళికలతో లక్ష్యాన్ని ఎంచుకుని ఛేదించే వరకు కష్టపడాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.ప్రభుదాస్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇనిస్టిట్యూట్ అఫ్ బ్యాంకింగ్ స్టడీస్ సంస్థకు చెందిన దినేష్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ప్రభుదాస్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ముందస్తు రోజుల్లో ఏం ఉద్యోగం చెయ్యాలో నిర్ణయం తీసుకొని డిగ్రీ స్థాయి నుంచే ప్రణాళిక వేసుకొంటే తమ లక్ష్యం చేరుకుంటారన్నారు. డిగ్రీ చదువుతున్నప్పుడే రెండు సంవత్సరాలు ఆన్‌లైన్‌లో కోచింగ్ తీసుకుంటే మంచి ఉద్యోగాలు వచ్చే అవకాశాలున్నాయని చెప్పారు. ఇంగ్లీష్ లెక్చరర్ డాక్టర్ ఏ.నగేష్ మాట్లాడుతూ డిగ్రీతో పాటే భవిష్యత్‌లో ఏం అవుతారో నిర్ణయం తీసుకొని కష్టపడాలన్నారు. తెలుగు, కామర్స్ లెక్చరర్‌లు డాక్టర్ గంధం వేణు, బి.సౌరిలమ్మ వైవీ రమణ పాల్గొన్నారు.

సిగ్గు లేకుండా గొప్పలు చెప్పకుంటున్నారు..

- మాజీ ఎమ్మెల్యే అన్నా

తర్లుపాడు: సూపర్–6 అంటూ బూటకపు హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చకుండా ఏదో చేసినట్లు సిగ్గు లేకుండా కూటమి నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు విమర్శించారు. ఆదివారం రాత్రి తుమ్మలచెరువులో పెద్ద షరిగత్ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన హామీలు తూచా తప్పకుండా నాటి సీఎం వైఎస్ జగనన్న నెరవేర్చారన్నారు. ప్రజలకు ఎవరు మంచి చేశారో.. ఎవరు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ప్రజలను వంచిస్తున్నారో.. ప్రజలందరూ గమనించాలన్నారు. మీకు మేలు చేసిన జగనన్నను, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని రాబోయే రోజుల్లో ఆశీర్వదించాలని కార్యకర్తలను కోరారు. ఖాశీంస్వామి ఆశీస్సులతో అందరి కుటుంబాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, మన ప్రాంతం సస్యశ్యామలంగా ఉండాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఖాశీంస్వామి దర్గాలో పార్టీ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అన్నాను ఘనంగా సన్మానించారు. ముందుగా సర్పంచ్ షాజహాన్, గ్రామ పార్టీ అధ్యక్షుడు షరీఫ్, నాయకులు అబ్దుల్ ఆధ్వర్యంలో అన్నాకు స్వాగతం పలికారు. ఎంపీపీ రామసుబ్బారెడ్డి, పార్టీ అధ్యక్షుడు మురారి, మాజీ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్‌లు రామిరెడ్డి, వెంకటరెడ్డి, ఎబినేజర్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.



అన్నాను సన్మానిస్తున్న నాయకులు